క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల: ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో పలువురిని ఆదివారం పరామర్శించారు. కౌన్సిలర్ నల్లి కృష్ణవేణి మామ అప్పలస్వామి ఇటీవల చనిపోయారు. దీంతో కృష్ణవేణి ఇంటికి వెళ్లి అప్పలస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల కుమారుడ్ని కోల్పోయిన మాత జగదీష్‌ను.. భార్యను కోల్పోయిన తుపాకుల వెంకటరమణను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్సీ వెంట నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, కో ఆప్షన్ సభ్యురాలు మాత సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పొంద్రంకి సత్యనారాయణ, తుమ్మ నారాయణమూర్తి, ఎంఎం నాయుడు, తదితరులున్నారు.

రామతీర్థంలో హరేకృష్ణ భక్తుల సందడి



స్వామి సన్నిధిలో భజనలు చేస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో బెంగళూరుకు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థ భక్తులు ఆదివారం సందడి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల సందర్శనలో భాగంగా సుమారు 25 మంది భక్తులు సీతారామస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టి సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో హరే రామ, హరే కృష్ణ భజనలు నిర్వహించారు. రామక్షేత్ర విశిష్టతను దేవస్థాన అర్చకులు వారికి వివరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నెల్లిమర్ల: మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభంకానున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా మండలంలోని జగన్నాథపురం, చినవల్లూరు, పెదవల్లూరు, మోపాడ గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురజాడ అడుగుజాడల్లో ముందుకు సాగాలి

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమంలో మాట్లాడుతన్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి



విద్యార్థుల నృత్య ప్రదర్శన

విజయనగరం ఫూల్‌బాగ్: గురజాడ అప్పారావు అడుగుజాడలో విద్యార్థులంతా ముందుకు సాగాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. స్థానిక కంటోన్మెంట్‌లోని గురజాడ స్కూల్‌లో ఆదివారం జరిగిన రజతోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల గౌరవ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ ఎం. స్వరూప, హెచ్ఎం పి. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఆదివారం మాదిరి గానే అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ఆలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అ న్నదానం చేశారు.

ఆధ్యాత్మికతకు నెలవు ఈ నేల

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



సత్యసాయి ధ్యానమండలి రజతోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

విజయనగరం: కళలు, ఆధ్యాత్మికతకు నెలవైన విజయనగరంలో పుట్టడం ఒక అదృష్టమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురజాడ వంటి ఎంతోమంది మహానుభావులు నడయాడిన ప్రాంతమని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి ధ్యాన మండలి (విజయవాడ) రజతోత్సవ వేడుకలను నగరంలోని ఎస్‌వీఎన్ నగర్ సుజాత కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలిగా కోలగట్ల శ్రావణి.. తొలుత ధ్యానమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షమయ్య గురూజీతో కలిసి దత్తాత్రేయ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సత్యసాయి ధ్యానమండలి వారు ఒక పెద్ద కుటుంబాన్ని ఆధ్యాత్మికత వైపు నడిపిస్తున్నారని, మంచి సందేశాన్ని సమాజానికి అందిస్తున్నారని తెలిపారు. ఆధ్యాత్మికత భావాన్ని ప్రజల్లో పెంపొందించడంతో పాటు అనాథ పిల్లలకు అండగా నిలవడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి ప్రజాసేవే పరమార్థంగా నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కన్నా, గొప్ప కార్యం మరొకటి ఉండదని భావించి నగరంలో ఉచితంగా భోజనం అందించే ఆరు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను, సేవాభావాన్నే తాను వారసత్వంగా తీసుకున్నానని వెల్లడించారు. ప్రజలంతా ఈర్ష్యను విడనాడి సన్మార్గం వైపు నడవాలని పిలుపునిచ్చారు. సత్యసాయి ధ్యానమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షమయ్య గురూజీ మాట్లాడుతూ, మన అంతరంగంలోనే ఆధ్యాత్మికత ఉందన్న విషయాన్ని మరిచిపోయి బయట ఎక్కడో వెతుకుతున్నారని తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎదగాలనుకుంటే ఏ సంస్థతోనూ, ఏ గురువుతోనూ భౌతిక సంబంధం కోరుకోవద్దని హితవు పలికారు. కళలు, సాహిత్యం, ఆధ్యాత్మికతకు విజయనగరం పుట్టినిల్లు కనుకనే ఈ వేడుకలను ఇక్కడ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం రజతోత్సవ సంచికను అతిథులు ఆవిష్కరించారు. నర్తనశాల అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ధ్యానమండలి సభ్యులు కోలగట్ల శ్రావణిని ఉచితరీతిన సత్కరించారు. శశిభూషణ్ గురూజీ, గంగునాయుడు గురూజీ, ధ్యానమండలి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

నేత్ర వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో స్థానిక సాధనా యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్, గరివిడి ఎంఈఓ పోలుబోతు రామారావు ప్రారంభించారు. జరజాపుపేటతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మొత్తం 250 మంది రోగులను వైద్యులు పరీక్షించగా.. 48 మందిని కాటరాక్ట్ ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. స్ఫూర్తి సేవాసమితి, మిత్రమా వెల్ఫేర్ అసోసియేషన్, ఉషోదయా యూత్ ప్రతినిధులు శిబిరంలో సేవలందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, స్థానిక పెద్దలు పొంద్రంకి సత్యనారాయణ, తుమ్మ నారాయణమూర్తి, నల్లి చంద్రశేఖర్, మద్దిల శ్రీనివాసరావు, కాళ్ల రాజశేఖర్, కిల్లంపల్లి రామారావు, సాధనా ప్రతినిధులు పోలుబోతు దుర్గాప్రసాద్, బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

నెల్లిమర్ల రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మొయిద గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీలతో పాలన సాగించిన చంద్రబాబు అర్హులకు మొండిచేయి చూపించి మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులు, అధికారులను పంపిస్తూ వారి అవసరాలను తీర్చే విధంగా సీఎం జగనన్న కృషి చేస్తున్నారని కొనియాడారు.

అర్హత ఉంటే పథకం అందాల్సిందే..

అర్హులెవ్వరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగనన్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ పెనుమత్స తెలిపారు. అధికారులు, గ్రామ స్థాయి సిబ్బందితో నెల రోజుల పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ఫీజు లేకుండా కుల, స్థానికత, ఆదాయం, వివాహం, జనన, మరణ మొదలైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చాన్నారు. అధికారులు, సిబ్బంది ఇళ్ల వద్దకే వచ్చి సురక్ష సర్వే చేస్తారని, సమస్యలు వారికి చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి..



47వ సచివాలయం పరిధిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు, సిబ్బంది

- ఉత్సాహభరితంగా జగనన్న సురక్ష కార్యక్రమం
- 11 రకాల ధ్రువపత్రాల జారీకి వివరాల సేకరణ

విజయనగరం: ప్రజల ముంగిటికే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమమైన జగనన్న సురక్ష కార్యక్రమం నగరంలో ఉత్సాహభరితంగా ఆదివారం సాగింది. కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ధ్రువపత్రాల జారీకి అవసరమైన వివరాలను సేకరించారు. 11 రకాల ధ్రవపత్రాలు అందించేందుకు నిర్దేశించిన విధానం ప్రకారం ప్రజల నుంచి ఆధారాలు స్వీకరించి త్వరలో ధ్రువపత్రాలు జారీ చేయనున్నారు. ఇందుకోసం సచివాలయాల వారీగా టీమ్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా.. రూపొందించిన డేటా ప్రకారం ఆయా తేదీలలో ప్రజలను కలిసి కార్యక్రమం విశిష్టతను వివరించి అవసరమైన డాక్యుమెంట్లను స్వీకరించనున్నారు. కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ అండ్ కరెక్షన్, కుటుంబ సభ్యుల ధ్రువీకరణాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో మొబైల్ నెంబర్ అనుసంధానం, కౌలు రైతుల గుర్తింపు కార్డులు, కొత్త రేషన్ కార్డు విభజన వంటి 11 రకాల సేవలు అందించనున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ధ్రువపత్రాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నామని నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములునాయుడు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులైతే రూ.150.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు ఈనెల 30న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

నేడు జగనన్న సురక్షపై అవగాహన

నెల్లిమర్ల: జూలై 1వ తేదీ నుంచి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహించే కార్యక్రమంలో నెల్లిమర్ల మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు నగర పంచాయతీకి చెందిన వార్డు కౌన్సిలర్లు హాజరుకావాలని సంబంధిత అధికారులు సూచించారు.

పుస్తకాల విక్రయం నిలిపివేత



పుస్తకాల గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ రాజు

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పుస్తకాలు విక్రయిస్తుండడంపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు విక్రయాలను అడ్డుకున్నారు. ఎంఈఓ రాజు సమక్షంలో పుస్తకాల రూమ్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఆదివారం మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ పట్టణంలో పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు విక్రయిస్తున్నాయన్నారు. అధికారుల స్పందించకపోవడంతో తామే పలు పాఠశాలల్లో విక్రయాలను అడ్డుకుని పుస్తకాల రూమ్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు రవికుమార్, సౌమ్య, పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు లావణ్య, సమీర, ఉమ, నాయకులు సోమేష్, మణికంఠ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తస్థాయి సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

చీపురుపల్లి: రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సంతృప్త స్థాయిలో సేవలందించడమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులతో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి 30 వరకు ప్రతీ ఇంటికి అధికారులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు వెళ్లాలని చెప్పారు. 11 అంశాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. మండల అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ సచివాలయంలోనూ ఒక రోజంతా గడుపుతారని చెప్పారు. అంతకుముందే వలంటీర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. తర్వాత షెడ్యూల్ ప్రకారం అధికారుల బృందం సచివాలయాలకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని, అదేరోజున 'జగనన్నకు చెబుదాం' డెస్క్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జగనన్న సురక్షలో ఉన్న 11 అంశాలకు మించి ఏవైనా సమస్యలు ఉంటే 'జగనన్నకు చెబుదాం' డెస్క్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంతవరకు ప్రతీ సచివాలయానికి ఇద్దరు గృహ సారథులు మాత్రమే ఉన్నారని, మరో గృహ సారథిని నియమించుకోవాలని సీఎం జగన్ సూచించినట్లు తెలిపారు.

ఏమీ చేయని వారే గొప్పలు చెప్పుకుంటున్నారు

గతంలో అధికారంలో ఉండి ఎలాంటి సంక్షేమం, అభివృద్ధి చేయకుండా, ఇచ్చిన హామీలు అమలు చేయని వారే మరోసారి ప్రజల్లోకి వచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని, అలాంటిది నాలుగేళ్ల పరిపాలనలో 98 శాతం హామీలు అమలు చేసిన మనం ఎంత చెప్పుకోవాలో ఎవరికి వారే ఆలోచన చేయాలని పార్టీ నాయకులకు జెడ్పీ చైర్మన్ దిశా నిర్దేశం చేశారు. అర్హులకు నిష్పక్ష పాతంగా పథకాలు అందించిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో పని చేస్తున్నందుకు గర్వపడాలన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేయూతనందించడం ఆనందదాయకం

- విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్



సీఎం చిత్రపటం వద్ద జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: విశ్వబ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందించడం ఆనందదాయకమని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనాప్రసాద్ అన్నారు. జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి ముక్కాముల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కర్రల మార్కెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జనాప్రసాద్ మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవం మది విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలన్నింటికీ ధూపదీప నైవేద్య ఖర్చులకు ప్రతినెలా రూ. 5 వేలు అందించే పథకం వర్తింపజేయడం ఎంతో సంతప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, బొద్దూరు లక్ష్మణరావు, 3వ డివిజన్ ఇన్‌చార్జ్ రాంప్రసాద్, సంఘం ఉపాధ్యక్షుడు గరుగు నాగరాజు, తామరాపల్లి అప్పలాచారి, పొన్నాడ శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, రమణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరం..



నాడు ఎండిపోయిన చెట్లు



నేడు ఆకులతో పచ్చగా విరబూసిన చెట్లు

ఆకులన్నీ రాలిన చోటే.. కొత్త చిగురు కనిపిస్తోంది.. అన్నాడో సినీ కవి. ఆయన చెప్పినట్లు గానే పోలీస్ పరేడ్ గ్రౌండ్ రోడ్డులో కొద్ది రోజుల కిందట ఆకులన్నీ రాల్చేసి వెలవెలబోయిన చెట్లు నేడు కొత్త చిగురులతో దర్శనమిస్తోంది. రోడ్లకిరువైపులా చెట్లన్నీ కొత్త చిగుర్లుతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పేదల అభ్యున్నతికి నిరంతర కృషి



మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

గంట్యాడ: పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుపడే వ్యక్తి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు అభివృద్ధి చెందాలని పరితపించే గొప్ప మనసున్న వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ముంగిటకే సేవలు అందిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. ప్రజలకు మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ప్రతీ దానికి రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, ఎంపీటీసీ గులిపల్లి మంగమ్మ, సర్పంచ్ వర్రి సుధ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి సహాయం

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయతీకి చెందిన నర్సిపల్లి మెట్టపై శ్రీదేవీ క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందికి జారిపడి మృతి చెందిన కార్మికుడు కుటుంబానికి రూ.8లక్షల పరిహారం చెల్లించేందు కు క్వారీ యాజమాన్యం అంగీకరించిందని సీఐటీయూ నాయకుడు చల్లా జగన్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పోలీగూడ గ్రామానికి చెందిన గెమ్మెల బుద్దు (30) మెట్టపై శనివారం క్వారీ పనిచేస్తుండగా జారి పడి చనిపోయారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని క్వారీ యాజమాన్యంతో సీఐటీయూ నాయకుడు చల్లా జగన్, కార్మికులు ఆదివారం చర్చలు జరిపారు. రూ.8 లక్షలు పరిహారం చెల్లించడంతో పాటు ఇన్స్యూరెన్స్ డబ్బులు వచ్చేవరకు కార్మికుడి జీతంలో సగం డబ్బులను ఆయన కుటుంబానికి చెల్లించడానికి క్వారీ యాజమాన్యం అంగీకరించిందని జగన్ చెప్పారు. అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, కార్మిక సంఘాల నాయకులు, క్వారీ యజమానులు రమణమూర్తి, మురళి పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్లు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆదివారం తెలిపారు. 6వ తరగతిలో 33, 7వ తరగతిలో 26, 8వ తరగతిలో 15, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు ఈనెల 28లోగా పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు ఆధార్, రేషన్‌కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జెరాక్స్‌లను జత చేయాలని సూచించారు. ఈ నెల 30న ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని, ఏ తరగతిలో ప్రవేశించదలచుకున్నారో దానికి ముందుతరగతి పాఠ్యాంశాలపై ప్రశ్నాపత్రంఉంటుందని వివరించారు.

పశువులకు టీకాలు వేయండి

గుర్ల: పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయాలని పశువైద్యాధికారులకు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు ఆదేశించారు. మండలంలోని రాగోలులో వరుసుగా నాలుగు పశువులు మృతి చెందగా, మరికొన్ని పశు వులు అనారోగ్యంతో బాధపడుతున్నాయి. అనారో గ్యంతో ఉన్న పశువులను బంగారునాయుడు ఆదివారం పరిశీలించారు. గ్రామంలో ఉన్న 450 పశువులకు వెటర్నరీ వైద్యులు వైద్యపరీక్షలు చేసి అవసరమైన టీకాలు, వైద్యం అందించాలని కోరారు.